నమస్తే తెలంగాణ

# జిందగీ

13

హైదరాబాద్ | శనివారం 15 జూన్ 2024 www.ntnews.com


చిన్నతెర

# సౌత్ అంటే ఇష్టం!

**ఉత్తరాదిన పుట్టి పెరిగినా దక్షిణాదిపై అభిమానం ఆమెకు. అదే తమిళ, తెలుగు పరిశ్రమల్లో అవకాశాలు అందించింది. థియేటర్ ఆర్టిస్ట్‌గా కెరీర్ ప్రారంభించి, చేతికందిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకుంటూ సినిమాలు, సీరియల్స్ ద్వారా ప్రేక్షకులను అలరిస్తోంది జీ తెలుగు 'మా అన్నయ్య' సీరియల్ నటి స్మృతీ కశ్యప్. ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాదినే టెలివిజన్ నటీనటులకు ప్రేక్షకుల్లో ఆదరణ ఎక్కువ అంటూ జిందగీతో స్మృతి పంచుకున్న ముచ్చట్లు..**

నేను పుట్టిపెరిగింది ఉత్తర్‌ప్రదేశ్‌లో అయినా కెరీర్ ప్రారంభించింది ముంబయిలో. బీకాం పూర్తయ్యాక ముంబయికి వెళ్లి మోడలింగ్ చేస్తూనే, థియేటర్ ఆర్టిస్ట్‌గా పనిచేశా. మా అమ్మ కూడా టెలివిజన్ నటి కావడంతో నటనపై ఆసక్తి పెరిగింది. నేను చదువుకున్న బోర్డింగ్ స్కూల్లో చదువుతో పాటే ఆటపాటల మీద కూడా ఫోకస్ చేసేవాళ్లు. నాకు కూడా చదువు కంటే మిగతా సాంస్కృతిక కార్యక్రమాలంటేనే ఆసక్తిగా ఉండేది. అమ్మ హిందీ, బెంగాలీ సీరియల్స్‌లో నటిస్తుంది. నేను అమ్మతోపాటు షూటింగ్స్‌కి వెళ్తుండేదాన్ని. అమ్మ తప్ప మా కుటుంబంలో అందరూ ప్రభుత్వ ఉద్యోగులే. నన్ను కూడా ప్రభుత్వ ఉద్యోగిగానే చూడాలనుకున్నారు. నాకు మాత్రం నటనే ప్యాషన్ అయింది.

### ఆమెలా కనిపించాలని..

చిన్నప్పటి నుంచీ మాధురీ దీక్షిత్‌కి వీరాభిమానిని. ఆమెలా తెరపై కనిపించి అందరి మెప్పు పొందాలనుకున్నా. థియేటర్‌లో పనిచేస్తుండగా ఓ హిందీ సినిమాలో అవకాశం వచ్చింది. ఆ తర్వాత సరిగమప ప్రొడక్షన్స్‌లో తమిళ సీరియల్ రోజాలో నటించాను. మంచి పేరు వచ్చింది. అందులో నెగెటివ్ రోల్. హీరోయిన్‌గా నా మొదటి సీరియల్ జీ తెలుగులో ప్రసారమవుతున్న మా అన్నయ్య. దీంతోపాటు సన్‌టీవీలో మరో సీరియల్లో నటిస్తున్నా. ఉత్తరాదికంటే దక్షిణాదిన టెలివిజన్ షోస్‌ను, నటీనటులను అమితంగా ఆదరిస్తారు. మా అన్నయ్య సీరియల్ ఈమధ్యనే ప్రారంభమైనా బయటికి వెళ్తే అందరూ నన్ను గుర్తుపట్టి 'శివ' అంటూ నా పాత్ర పేరుతో పిలుస్తున్నారు. నన్ను తమ అమ్మాయిగా ఆదరిస్తున్నందుకు తెలుగు ప్రేక్షకులకు ఎప్పటికీ రుణపడి ఉంటా. మైత్రీ మూవీ మేకర్స్ ద్వారా తెలుగు పరిశ్రమకు పరిచయమవడం నిజంగా అదృష్టంగా భావిస్తున్నాను.



### మొదట ఇబ్బందిపడ్డా..

రోజా సీరియల్లో అవకాశం వచ్చినప్పుడు నాకు అస్సలు తమిళ్ రాకపోవడంతో బాగా భయపడ్డా. కానీ సీరియల్ టీమ్ సపోర్ట్‌తో త్వరగానే తమిళ్ నేర్చుకున్నా. ఇప్పుడు చక్కగా మాట్లాడగలను కూడా. తెలుగులో అవకాశం వచ్చినప్పుడు కూడా అలాగే అనిపించింది. కానీ 'మా అన్నయ్య' టీమ్ నన్ను బాగా సపోర్ట్ చేసింది. డైరెక్షన్ టీమ్‌లోని వారందరూ నాతో ఓపిగ్గా డైలాగ్స్ చెప్పిస్తారు. అస్సలు భాష తెలియకపోయినా చాలా కాన్ఫిడెంట్‌గా సీన్‌కి కావల్సిన ఎమోషన్స్ ఇస్తానని మెచ్చుకుంటారు. చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చినా పెద్ద తేడా లేదు. అక్కడా ఇక్కడా వాతావరణం దాదాపుగా ఒకటే. కానీ ఇక్కడ హిందీ, ఇంగ్లిష్ ఎక్కువగా మాట్లాడతారు. దాంతో నాకు భాష పెద్ద సమస్యగా మారలేదు.

### రోజూ ఇడ్లీ, సాంబార్..

నేను టామ్ బాయ్ టైపు. అందుకే మా అన్నయ్య సీరియల్ కథ వినగానే ఒప్పుకొన్నా. కెరీర్ మొదలుపెట్టినప్పటి నుంచీ ఐఏఎస్, పోలీస్ వంటి పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో నటించాలని అనుకున్నా. ఆ కోరిక మా అన్నయ్య సీరియల్‌తో తీరింది. రొమాన్స్ కన్నా ఫైటింగ్, యాక్షన్ అంటేనే ఇష్టం. చిన్నప్పటినుంచీ నాకు దక్షిణాది ఫుడ్ అంటే చాలా ఇష్టం. కానీ మా ఇంట్లో బంధువులు వచ్చినప్పుడు మినహా ఇడ్లీ, దోశ వంటివి చేసేవాళ్లు కాదు. ఇప్పుడు మూడుపూటలా ఇడ్లీ, సాంబార్ తింటున్నా.



### నా ఫేవరెట్ హీరో..

తెలుగులో మహేష్ బాబు, విజయ్ దేవరకొండ అంటే చాలా ఇష్టం. వాళ్ల ప్రతి సినిమా మిస్‌కాకుండా చూస్తాను. త్వరలోనే వాళ్లను కలిసే అవకాశం వస్తుందని ఆశిస్తున్నా. ఇంట్లో అమ్మ, నేను సీరియల్స్, స్టోరీస్ గురించి చర్చించుకుంటాం. భాష రాకపోయినా నా ప్రతి సీరియల్‌ని ఇంట్లో అందరూ చూస్తారు. అమ్మ నటనలో మెలకువలు చెబుతుంది.. కొన్ని సినిమాల్లో అవకాశం వచ్చినా, రొమాంటిక్ రోల్స్‌లో నటించడానికి ఇంట్లో అనుమతి లేదు కనుక ఒప్పుకోలేదు. మంచి పాత్ర వస్తే మాత్రం చేస్తా. సీరియళ్లలో నన్ను నేను మెరుగుపరచుకునేందుకు కష్టపడుతూనే ఉంటా.

... హరిణి

# మేకప్ లేకుండా మెరిసేద్దాం



**పండుగలు,** ఫంక్షన్లప్పుడు అతివలు స్పెషల్‌గా కనిపించాలని కోరుకుంటారు. దానికోసం వారం ముందు నుంచే రకరకాల బ్యూటీ టిప్స్ ఫాలో అవుతుంటారు. అసలు రోజు మేకప్ అయింది మొదలు మేకప్ చేసుకుంటూనే ఉంటారు. సెలెబ్రిటీల నుంచి సామాన్యుల వరకు దీనికి అతీతులేం కాదు. అయితే, మేకప్ వేసుకోవడం అన్ని సందర్భాల్లోనూ సాధ్యం కాకపోవచ్చు. పైగా ఖర్చుతో కూడుకున్న పని. అదేపనిగా వేసుకున్నా.. చర్మ సహజత్వం దెబ్బతింటుంది. అయితే మేకప్ లేకుండా కూడా ముఖారవిందాన్ని కమలం కన్నా కోమలంగా తీర్చిదిద్దుకోవచ్చు.

రోజువారీ జీవనశైలిలో చిన్నపాటి మార్పులతో సహజ సిద్ధమైన మెరుపు పొందవచ్చు. ప్రతిరోజూ ఎనిమిది గ్లాసుల నీళ్లు తాగడం తప్పనిసరి. దీనివల్ల శరీరంలోని టాక్సిన్లు బయటికి వెళ్లిపోతాయి. దాంతో చర్మం సహజంగా కాంతిని సంతరించుకుంటుంది.

వారానికి రెండుసార్లయినా ఐస్‌క్యూబ్స్‌తో ముఖంపై మర్దనా చేసుకుంటూ ఉండాలి. ఐదారు నిమిషాల పాటు ఇలా చేస్తే.. చర్మం తేలికగా మారుతుంది. ముడతలు తగ్గి చర్మం బిగుతుగా తయారవుతుంది. దద్దుర్లు ఉంటే తగ్గిపోతాయి.

మానసిక ఒత్తిడి, శారీరక బడలిక వల్ల కండ్ల కింద నల్లటి వలయాలు ఏర్పడతాయి. రోజూ పడుకునే ముందు అలోవెరా జెల్‌తో గానీ, కొబ్బరి నూనెతో గానీ కండ్ల కింద మర్దనా చేయాలి. పడుకునే ముందు ముఖాన్ని మంచినీటితో శుభ్రంగా కడుక్కోవాలి. అప్పుడు ముఖంపై చేరిన దుమ్ము కణాలు తొలగిపోయి చర్మం మృదువుగా కనిపిస్తుంది. ఈ టిప్స్ ఫాలో అయిపోతే.. మేకప్ లేకుండానే మీరు షో స్టాపర్‌గా కనిపిస్తారు.





స్టార్టప్ స్టోరీస్

# సూదీ.. దారం.. విజయ ప్రయాణం

**చిన్నప్పుడు నేర్చుకున్న కుట్టుపని ఆమెకు ఆర్థిక భరోసానిచ్చింది. ఆసక్తితో నేర్చుకున్న ఎంబ్రాయిడరీ వ్యాపారవేత్తగా నిలిపింది. ఈ రెండు యంత్రాల మధ్య మరచక్రం కన్నా వేగంగా పరుగులు తీసిందామె. పరిస్థితులు ప్రతికూలించినప్పుడు కాలం మొరాయించేది. భారంగా కదిలే కాలానికి ఓవర్ హాలింగ్ చేసి తనకు అనుకూలంగా మలుచుకునేది. వస్త్ర వ్యాపారంలో ఎంబ్రాయిడరీకి ఉన్న డిమాండ్‌ను గుర్తించి అటుగా అడుగులు వేసిందామె. తన దారిలో ఎందరినో నడిపిస్తున్నది. కుట్టు యంత్రం నుంచి కనికట్టు చేసే కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ మెషీన్ అమ్మకాల వరకు సాగిన సిరిగణేష్ ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపకురాలు పుట్ట మహాలక్ష్మి ఈ వారం మన స్టార్టప్ స్టార్. తన విజయ ప్రస్థానం ఆమె మాటల్లోనే..**

సీకో చీరల పుట్టిల్లు గద్వాల్ మా ఊరు. మధ్యతరగతి నేత కార్మికుల కుటుంబం. మా ఆయన పేరు ఆనంద్‌బాబు. వారింట్లో అందరూ ప్రభుత్వ ఉద్యోగులే. అనుకోని సంఘటనలు, ఒడుదొడుకుల స్థితిగతులు ఆర్థిక స్వాతంత్ర్యం సాధించే దిశగా నన్ను అడుగులు వేయించాయి. అమ్మగారింట్లో నేర్చుకున్న కుట్టుమెషీన్‌తో నా ప్రయాణం మొదలైంది. తర్వాత డ్రెస్ మెటీరియల్స్ అమ్మకాలు, బ్యూటీ పార్లర్ నిర్వహణ ఇలా నా ప్రస్థానం కొనసాగింది. మొదట్లో ఆటంకాలు పలకరించాయి. అయినా నిరుత్సాహపడలేదు. నేను సాధించగలను అన్న నమ్మకం నన్ను నడిపించింది. అలా సిరిగణేష్ ఎంటర్‌ప్రైజెస్‌తో ఆంత్రప్రెన్యూర్ అవతారమెత్తాను.

### అందరూ వద్దన్నవారే..

మొదట్లో నేను కుట్టుమెషీన్ పట్టుకున్నప్పుడు అందరూ ఎందుకు? అన్నవారే! ఇంటి పనులు చూసుకుంటే చాలు అని అడ్డుపడ్డవారే. కానీ, ఏదైనా సాధించాలనే తపన, తెలిసిన నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోవాలన్న ఆలోచనలు నన్ను తీరికగా ఉండనివ్వలేదు. వెంటనే తెలిసిన వారి దగ్గర కుట్టుమెషీన్ అద్దెకు తీసుకొని టైలరింగ్ మొదలుపెట్టాను. ఎంత కష్టపడ్డా మా ఆర్థిక అవసరాలకు సరిపడా సంపాదించలేకపోయాను. లాభం లేదనుకొని హైదరాబాద్‌కు మకాం మార్చాను. ఇక్కడికి వచ్చాక డ్రెస్ మెటీరియల్ దుకాణంలో టైలరింగ్ చేశాను. అప్పట్లో బ్యూటీ పార్లర్స్‌కు చాలా డిమాండ్ ఉండేది. దీంతో కాస్మెటాలజీలో శిక్షణ తీసుకున్నా. ఏడాదిలోపే ఇంటి దగ్గరే బ్యూటీ పార్లర్ స్టార్ట్ చేశాను. అందులోనే డ్రెస్ మెటీరియల్స్ అమ్ముతూ, టైలరింగ్ చేసేదాన్ని.

> **నష్టానికి అమ్మేసి..**
>
> "వ్యాపారంలో కుదురుకునే సమయంలో మల్టీ నీడిల్ యంత్రం అందుబాటులోకి వచ్చింది. అదెలా నిర్వహించాలో తెలియలేదు. సింగిల్ నీడిల్ ఎంబ్రాయిడరీకి గిరాకీ తగ్గిపోవడంతో నేను గతంలో కొన్న యంత్రాన్ని నష్టానికి అమ్మేయాల్సి వచ్చింది. ఆ నష్టాలన్నీ పూడ్చుకున్న తర్వాత అధునాతన టెక్నాలజీతో పనిచేసే మల్టీ నీడిల్ కంప్యూటర్ ఎంబ్రాయిడరీ మెషినరీపై అధ్యయనం చేశాను. కస్టమైజ్డ్ విధానంలో అవసరానికి తగినట్లుగా మెషీన్ డిజైన్ చేసుకుని వ్యాపారాన్ని కొనసాగించాను.

### మలుపులు ఎన్నో..

నాలుగు రాళ్లు వస్తున్నాయని అక్కడే ఆగిపోతే ఈ రోజు సిరిగణేష్ ఎంటర్‌ప్రైజెస్ ఉండేది కాదు. నిరంతరం పరిశ్రమ కొనసాగిస్తేనే విజయం వరిస్తుంది. టైలరింగ్‌కు అనుబంధంగా ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్, చీరలపై పెయింటింగ్ చేయాలనిపించింది. అదే నా వ్యాపారం అవుతుందని అప్పుడు అనుకోలేదు. పైగా అప్పట్లో సింగిల్ నీడిల్ ఎంబ్రాయిడరీకి బాగా గిరాకీ ఉండేది. ఆ పని చేసేవాళ్లు చాలా తక్కువమంది ఉండేవారు. దీంతో ఎలాగైనా ఎంబ్రాయిడరీ మెషినరీ కొనాలని ఫిక్సయ్యాను. నేను సొంతంగా సంపాదించుకున్న బంగారం అమ్మేశాను. మా తమ్ముడు రూ.2 లక్షలు సమకూర్చాడు. ఆ మొత్తంతో సింగిల్ నీడిల్ ఎంబ్రాయిడరీ మెషినరీ కొని మరో ప్రయాణం మొదలుపెట్టాను.

### వృత్తి నైపుణ్యాలను పెంపొందిస్తూ..

అంచెలంచెలుగా ఎదుగుతూ 2011లో సిరిగణేష్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థను ప్రారంభించాను. మా దగ్గర కస్టమైజ్డ్ ఎంబ్రాయిడరీ యంత్రాలు విక్రయిస్తాం. మార్కెట్‌లో అందుబాటులో ఉన్న యంత్రాల విడిభాగాలను తెప్పించి, వినియోగదారులు కోరిన విధంగా పూర్తిస్థాయి యంత్రంగా డెవలప్ చేసి ఇస్తాం. ప్రస్తుతం ఒక్కో యంత్రం ధర రూ. 3 లక్షల నుంచి రూ. 7లక్షల వరకు ఉంది. వినియోగదారులకు యంత్రాలు విక్రయించి చేతులు దులుపుకోం.



వృత్తి నైపుణ్యాలను పెంపొందించేలా ప్రోత్సహిస్తాం. ఎంబ్రాయిడరీ డిజైన్లపై అవగాహన కల్పిస్తాం. అంతేకాదు యంత్ర నిర్వహణలో పూర్తి శిక్షణనిస్తాం. మెషీన్ డెలీవరీ, ఇన్‌స్టలేషన్‌తోపాటు ఏడాదిపాటు వారి వ్యాపారం కొనసాగించేందుకు అవసరమైన ఓరియంటేషన్ ఇస్తాం. ఈ తరహా సేవలు అందించే సంస్థలు మార్కెట్‌లో చాలానే ఉన్నాయి. కానీ, వినియోగదారులకు పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వడం మా ప్రత్యేకత. ఇప్పటివరకు దాదాపు 2,000 యంత్రాలను విక్రయించాం. దేశవ్యాప్తంగా మాకు కస్టమర్లు ఉన్నారు. వినియోగదారులకు అందిస్తున్న సేవలే మా సంస్థ ఎదుగుదలకు కారణం. అంతేకాదు ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలమంది మహిళలు సిరిగణేష్ సంస్థ ద్వారా ఉపాధి పొందుతుండటం సంతోషాన్నిస్తున్నది. సంస్థ పనితీరును ప్రశంసిస్తూ టైమ్స్ బిజినెస్ అవార్డు, సుమన్ ఆర్ట్స్ అవార్డులు వరించాయి.

... కడార్ల కిరణ్

# బరువు దించుకుందాం




ఈ రోజుల్లో అధిక బరువు చాలామంది ఎదుర్కొంటున్న సమస్య. బరువు పెరిగేకొద్దీ పోలోమంటూ అనారోగ్యాలూ వచ్చి చేరుతుంటాయి. అంతేకాదు, రోజురోజుకూ ఆహార్యంలోనూ తేడాలు కనిపిస్తాయి. ఆరోగ్యంగా ఉండాలన్నా, అందంగా కనిపించాలన్నా బరువు దించుకోవడం ఒకటే పరిష్కారం. బరువు తగ్గాలి అనగానే ఉపవాస దీక్షకు పూనుకుంటే సరిపోతుందని నోరు కట్టేసుకుంటుంటారు. కానీ, సరైన డైట్ పాటిస్తూ నియమబద్ధమైన వర్కవుట్లు చేస్తే బరువు తగ్గడం పెద్ద సమస్యేం కాదు. రెగ్యులర్‌గా ఈ ఎక్సర్‌సైజ్‌లు చేసి చూడండి.. తేడా మీకే తెలుస్తుంది.

### వాకింగ్- జాగింగ్- రన్నింగ్




రేపట్నుంచి పక్కా వాకింగ్ చేస్తా! వాకింగ్ కన్నా జాగింగ్ మిన్న! జాగింగ్ కన్నా రన్నింగ్ చేస్తే కింగులమే! ఇలా తర్కించుకోవడంతోనే రోజులు గడిపేస్తుంటాం. మాటలు కోటలు దాటినా కాలు గడప దాటకుంటే.. బరువు తగ్గడం మాట అటుంచితే, పెరగడం ఖాయం. అందుకే, వాకింగ్, జాగింగ్, రన్నింగ్ ఏది ఎంచుకున్నా దాన్ని నిత్యకృత్యంగా మలుచుకుంటేనే ఫలితం. క్రమం తప్పకుండా ఇవి చేయడం వల్ల బరువు క్రమంగా తగ్గుతారు. శరీరం ఫిట్‌గా తయారవుతుంది.

### పుషప్స్



శరీరంలో అన్ని భాగాలకు ఉపయోగపడే వ్యాయామాల్లో పుషప్స్ ఒకటి. వీటితో శరీరంలోని దాదాపు అన్ని కండరాలు బలోపేతమవుతాయి. అంతేకాదు, పుషప్స్ కారణంగా బరువు కూడా తగ్గుతారు.

### స్క్వాట్స్



స్క్వాట్స్ చేస్తే ఎక్కువ మోతాదులో క్యాలరీలు బర్న్ అవుతాయి. ఎయిర్ స్క్వాట్స్, సైడ్‌స్టెప్ స్క్వాట్స్, సుమో స్క్వాట్స్, లీప్ స్క్వాట్స్ ఇలా రకరకాల వర్కవుట్లు బాడీని ఫిట్‌గా మారుస్తాయి. అదే సమయంలో బరువును తగ్గిస్తాయి.

### డంబెల్స్‌తో

శరీరాన్ని ఫిట్‌గా ఉంచే వాటిలో డంబెల్స్‌తో చేసే వ్యాయామం ముఖ్యమైనది. ఇది శరీరంలోని ఫంక్షనల్ మొబిలిటీని పెంచుతుంది. డంబెల్స్ చేతుల్లో పట్టుకొని గుంజిళ్లు తీసినట్టు చేసే ఈ వ్యాయామంతో కాళ్లు ఉక్కు స్తంభాల్లా దృఢంగా తయారవుతాయి. కండరాలు బలోపేతం అవుతాయి.



# నాకు.. నీకు.. నోకియా!

'మళ్లీ నోకియా ఏంటి బాబాయ్..' అంటారా? మళ్లీ డబ్బాఫోన్.. కనెక్టింగ్ పీపుల్ అంటున్నది. డంబ్‌ఫోన్లనే ఆశ్చర్యంగా చూసిన మన జనరేషన్.. ఇప్పుడు రెండేసి, మూడేసి స్మార్ట్‌ఫోన్లు వాడేస్తున్నది. కానీ, జనరేషన్ జెడ్ (1996-2010 మధ్య జన్మించిన వాళ్లు) స్మార్ట్‌ఫోన్లు చూస్తేనే చిరాకు పడుతున్నారట. అందమైన తమ కౌమారాన్ని కాటువేసిన గ్యాడ్జెట్స్‌పై గర్జ్ పెంచుకుంటున్నారని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ నివేదికలో తేలింది. 5జీ ఉచ్చుతో కాలాన్ని హరిస్తున్న స్మార్ట్‌ఫోన్‌కు తిలోదకాలిచ్చి.. తామంతా ఊయలలో ఉండగా బండ రింగ్‌టోన్‌తో జోలపాడిన డంబ్‌ఫోన్‌కు మారిపోతున్నారని నివేదిక సారాంశం. ఇంత వైరాగ్యం ఎందుకని ఆరా తీస్తే... స్మార్ట్‌ఫోన్‌తో స్క్రీన్‌టైమ్ పెరిగి వ్యక్తిగత జీవితాన్ని కోల్పోతున్నామని సమాధానం చెబుతున్నారు. జనరేషన్ జెడ్ సగటు స్క్రీన్ సమయం 7.2 గంటలుగా ఉంటున్నది. ఇన్నేసి గంటలు ఫోన్‌లో తలదూర్చి ప్రతిగా శారీరక అనారోగ్యంతోపాటు మానసికంగా కుంగుబాటును పొందుతున్నామని గ్రహించిన కొందరు యువకిశోరాలు.. డంబ్‌ఫోన్‌కు జై అంటున్నారు. ఆర్థిక లావాదేవీలకు మొబైల్ బ్యాంకింగ్ సరిపోతుందని చెబుతున్నారు. ఇక సామాజిక మాధ్యమాల సంగతేంటని అడిగితే.. అంతగా చూడాలనుకుంటే ల్యాప్‌టాప్ ఉండనే ఉందిగా అని సమాధానం చెబుతున్నారు. ల్యాండ్‌ఫోన్‌ను అబ్బురంగా చూసిన జనరేషన్ ఎక్స్, మిలీనియల్స్‌లో సింహభాగం ఇప్పుడు స్మార్ట్‌ఫోన్‌కు దాదాపు ఎడిక్ట్ అయిపోయారు. తాజాగా జనరేషన్ జెడ్‌లో వచ్చిన మార్పు వారి ముందుతరాలకూ గుణపాఠం కావాలని ఆశిద్దాం!!

